ఆక్రమణలో కాల్వ భూములు!

- యథేచ్ఛగా ఆక్రమించి చదును చేస్తున్న కొందరు రైతులు
- పట్టించుకోని అధికారులు



సారంగపూర్ మోర్ చెరువు సమీపంలో ఆక్రమణకు సిద్ధంగా కాలువ భూములు



జామ్‌లోని దుర్గానగర్ వద్ద మొరం తొలగించి చదును పనులు చేపట్టిన రైతులు

సారంగపూర్: ప్రతి చెరువుకు గోదావరి జలాలను అందించి రెండు పంటలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో 27వ ప్యాకేజీ కింద స్వర్ణ ప్రాజెక్టు నుంచి మామడ మండలం తాండ్ర వరకు 38 కిలోమీటర్ల మేర హైలెవెల్ కాలువ నిర్మించారు. కానీ ఈ కాల్వకు ఇరువైపులా ఉన్న రోడ్ల భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. గతంలో కాల్వ నిర్మాణం కోసం రైతుల నుంచి భూములు సేకరించి పరిహారం చెల్లించారు. అనంతరం కాల్వ నిర్మించగా ఇరువైపులా రోడ్డు కోసం విడిచిపెట్టిన భూములపై సమీప రైతుల కన్ను పడింది. దీంతో సదరు భూములను చదును చేసి ఆక్రమించుకునే పనిలో పడ్డారు.

సారంగపూర్ మండలంలో..

ఇప్పటికే సారంగపూర్ మండలంలోని స్వర్ణ, కౌట్ల (బి), సారంగాపూర్, జామ్, ధని, చించోలి(బి), సాయినగర్ గ్రామాల్లో భూములను ఆక్రమించి సాగు చేస్తుండగా వారిని చూసి మిగతా రైతులు సైతం అదేబాట పట్టారు.

పలుచోట్ల కల్లాల నిర్మాణం..

కాలువ భూముల్లో పలుచోట్ల రైతులు సాగు పనులు చేస్తూ.. మరికొన్ని చోట్ల పంటను ఆరబెట్టుకునేందుకు కల్లాలను నిర్మించారు. కాలువ నిర్మాణ సమయంలో హద్దులుగా ఏర్పాటు చేసిన పెద్ద పెద్ద బండరాళ్లను తొలగించి ఆక్రమించే పరిస్థితులు ఉన్నాయి. చాలా చోట్ల హద్దుల కోసం ఏర్పాటు చేసిన మొరం కుప్పలను విక్రయించి సదరు భూములను ఖాళీ చేయిస్తున్నారు.

మూడేళ్లుగా ఆక్రమణలు..

మూడేళ్లుగా కాల్వ భూముల ఆక్రమణల పర్వం కొనసాగుతున్నా.. ఒక్కరూ స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. గతంలో ఆయా గ్రామాలకు చెందిన పలువురు ఆక్రమణల తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన దాఖలాలున్నాయి. కానీ ప్రస్తుతం దీనిపై ఒక్కరు కూడా స్పందించడం లేదని రైతులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. కాలువ నిర్మాణ సమయంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించారు. ఆ సమయంలో మిగిలిన గుంట, రెండు గుంటల భూమిని కూడా తీసుకొని పరిహారం చెల్లించాలన్న రైతుల విజ్ఞప్తికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించింది. ప్రస్తుతం మిగిలిన భూమితోపాటు కాలువకు ఇరువైపులా రోడ్డు కోసం విడిచిపెట్టిన భూములను తిరిగి ఆక్రమించుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టకుంటే కాలువకు ఇరువైపులా ఉన్న రోడ్డు మాయమయ్యే పరిస్థితి తలెత్తుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కేసులు నమోదు చేస్తాం

హైలెవల్ కాల్వ పక్కన 36 ఫీట్ల మేర రోడ్డు ఉంటుంది. కాలువల పరిశీలనకు వచ్చిన ప్రతిసారి రైతులకు నిబంధనలు పాటించాలనే చెబుతున్నాం. అయినప్పటికీ కొందరు రైతులు రోడ్డు భూములను చదును చేస్తున్నారని మా దృష్టికి వచ్చింది. వెంటనే భూములను పరిశీలించి కాలువ భూములను ఆక్రమించిన వ్యక్తులపై కేసులు నమోదు చేస్తాం.

– మిరాజొద్దీన్, ఏఈ, నీటిపారుదలశాఖ

క్లుప్తంగా

నల్లాలకు నీటి సౌకర్యం



ప్రధానద్వారం వద్ద నీరు తాగుతున్న భక్తుడు

సాక్షి ఎఫెక్ట్..

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మూడు చోట్ల ఏర్పాటు చేసిన నల్లాలకు నీరు భక్తులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఈనెల 5న సాక్షిలో ఈనల్లాల్లో నీళ్లు రావు శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆలయ అధికారులు ప్రధాన ద్వారం వద్ద, వసతి గదుల వద్ద, డార్మెంటరీ హాలు వద్ద నల్లాలకు నీటి సౌకర్యం కల్పించారు.

ఏఐటీయూసీతోనే సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న రమేశ్

కడెం: ఏఐటీయూసీతోనే ఉద్యోగుల సమస్యలు పరిష్కారమవుతాయని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు భుక్యా రమేశ్ అన్నారు. బుధవారం కడెంలో నిర్వహించిన సమావేశంలో, కడెం, బెల్లాల్ సెక్టార్లకు చెందిన పలువురు అంగన్‌వాడీ టీచర్లు ఏఐటీయూసీలో చేరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాజేశ్వరి, లక్ష్మి, షహనాజ్, గంగామణి, జ్యోతి, నిర్మల, మంగ తదితరులున్నారు.

విప్‌ను కలిసిన జాన్సన్



పుష్పగుచ్ఛం అందజేస్తున్న జాన్సన్‌నాయక్

ఖానాపూర్: శాసనమండలిలో బీఆర్‌ఎస్ పార్టీ విప్‌గా నియమితులైన ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్‌ను బుధవారం హైదరాబాద్‌లో ఆ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

వంజర్‌లో వైద్యశిబిరం

సారంగపూర్: మండలంలోని వంజర్ గ్రామంలో హిందూవాహినీ ఆధ్వర్యంలో నిర్మల్‌కు చెందిన తిరుమల నర్సింగ్‌హోం వైద్యులు డాక్టర్ రమేశ్‌రెడ్డి, డాక్టర్ శివకుమార్ ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పలువురు గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆత్మ మాజీ డైరెక్టర్ మహేశ్‌కుమార్, రాజు, దారివంగ శ్యామ్‌రెడ్డి ఉన్నారు.

బుద్ధవిహార్‌కు భూమిపూజ

సారంగపూర్: మండల కేంద్రంలోని ఊరగుట్ట ప్రాంతంలో నిర్మించే బుద్ధవిహార్ నిర్మాణానికి బుధవారం బంతేజీ అశ్వంత్ భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బుద్ధుడి బోధనలు, ఆలోచనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బంతేజీ ప్రదీప్, నాయకులు నక్క రాజన్న, బౌద్ధ ఉపాసకులు ప్రవీన్, అరుణ తదితరులు ఉన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

బాసర: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకుల ద్వారా అందించే రుణాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బాసర టీజీబీ మేనేజర్ జ్ఞానేశ్వర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బ్యాంకు, ఐకేపీ సిబ్బంది కలిసి స్వయం సహాయక సంఘాల మహిళలకు పీఎంఈజీపీ తదితర పథకాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఖానాపూర్: మండలంలోని దిలావర్‌పూర్‌లో రాజరాజేశ్వర ఆలయ కమిటీ, బద్దిపోచమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కిషన్, నర్సయ్య, భాస్కర్, రాజన్న, శ్రీనివాస్, రవి, పోశెట్టి తదితరులు ఉన్నారు.

ఉత్సవాలకు రావాలని ఆహ్వానం

ఖానాపూర్: కడెం మండలం దిల్‌దార్‌నగర్ గ్రామ అక్కకొండ ఆలయ వార్షికోత్సవానికి హాజరు కావాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తహసీల్దార్ సుజాతకు ఆహ్వానం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. ఈనెల 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరిగే ఆలయ వార్షిక ఉత్సవాలకు హాజరుకావాలని కోరారు. అనంతరం సీఐ సైదారావును కలిసి ఆహ్వానం అందజేశారు. ఆలయకమిటీ అధ్యక్షుడు కొక్కుల లక్ష్మన్, కమిటీ సభ్యులు ఉన్నారు.

‘సర్వేతో మాలలకు అన్యాయం’



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

భైంసాటౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేసిన కులగణన సర్వేతో మాలలకు తీవ్ర అన్యాయం చేసిందని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సమితి నాయకులు అన్నారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ బుధవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట రహదారిపై ఆందోళన చేపట్టారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. వారు మాట్లాడుతూ 2011 జనాభా లెక్కలతో పోలిస్తే మాలల జనాభా పెరిగిందని.. 2025 జనాభా లెక్కలు చేయకుండానే వర్గీకరణ, కులగణన ఎలా చేస్తారని మండిపడ్డారు. 2025 జనాభా లెక్కల తర్వాతే వర్గీకరణపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు శంకర్ చంద్రే, గౌతం పింగ్లే, ప్రసంజిత్ ఆగ్రే, రాహుల్ దగ్డే, సురేశ్ షానే, మాణిక్ దగ్డే, సాహెబ్‌రావు తదితరులున్నారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి



ఎంపీవోకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

కడెం: విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న మండలంలోని ఉడుంపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి చైతన్యపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ఉట్నూర్‌లో ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్‌కు, కడెం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవో కవిరాజుకు వినతిపత్రం అందజేశారు. విధులకు సక్రమంగా హాజరవకుండా ప్రతి పనికి డబ్బులు వసూలు చేస్తు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఇందులో జబర్‌లాల్, లింగన్న, శ్రీధర్, అంజన్న, శ్రీనివాస్, విజయ్, రాకేశ్, తదితరులున్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

నర్సాపూర్(జి): పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉంటూ ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని తహసీల్దార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని విజిలెన్స్ అధికారులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఎస్సై సాయికిరణ్, డీటీ అబ్దుల్ వహీద్, ఆర్‌ఐలు వేణుగోపాల్, సుమలత, కార్యదర్శులు రాథోడ్ కైలాస్, నరేశ్‌కుమార్, నవనీత్ కుమార్, గంగాజల, శివకుమార్, రాజు, సంధ్యారెడ్డి, సంస్కృతి తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి ‘గజ్జలమ్మ’ వార్షికోత్సవం



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మ ఆలయ ఐదో వార్షికోత్సవం విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. బుధవారం ఆలయ ఆవరణలో వార్షికోత్సవానికి సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. ఈనెల 9న కుంకుమార్చన, హోమం, రథోత్సవం, 10న హోమం, అభిషేకం, పుష్పాభిషేకం, 11న బోనాల పండుగ నిర్వహించనున్నారు. శ్రీ శ్రీ గురుమంచి చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు జుట్టు లక్ష్మణ్, జక్కని గజేందర్, జుట్టు సుధాకర్, మేసినేని వెంకట్‌రావు, సాయన్న, బొంతల పోశెట్టి, పల్లికొండ గజేందర్, బోగ గోవర్ధన్, బోగ లక్ష్మణ్, ఉదయ్, గజ్జారాం అర్చకులు నగేశ్, దీక్షాపరులు పాల్గొన్నారు.

పన్నులు వందశాతం వసూలు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటరమేశ్

లోకేశ్వరం: గ్రామాల్లో ఇంటి పన్నులను వంద శాతం వసూలు చేయాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. గ్రామాల్లో మంచి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా నీరందించాలని సూచించారు. మురుగు కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తూ పారిశుధ్యానికి పెద్దపీట వేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సోలమాన్‌రాజ్ తదితరులు ఉన్నారు.

తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

కుంటాల: గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో లింబాద్రి పేర్కొన్నారు. బుధవారం మండలప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై గ్రామాల అభివృద్ధిపై చర్చించారు. పారిశుధ్యంపై నిర్లక్ష్యం వద్దని.. సకాలంలో నీటి, ఇంటిపన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీవో ఎంఏ రహీం ఖాన్, కార్యదర్శులు పాల్గొన్నారు

చిన్నారుల పూజలు

లోకేశ్వరం: భీష్మాష్టమి సందర్భంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులు బుధవారం బాగాపూర్ లక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో టీచర్లు సురేఖ, కల్పన, విజయలత, ముత్తవ్వ, పూజారి నరసింహస్వామి ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి



విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఖానాపూర్: తెలంగాణ ఫిజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి జక్కుల యోగేశ్ ప్రతిభ కనబరిచాడు. ఈనెల 12న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం నరేందర్‌రావు తెలిపారు. విద్యార్థిని బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు.

పరిహారం చెక్కు అందజేత

పెంబి: గతేడాది ఆగస్టు నెలలో మండలంలోని వస్పల్లి గ్రామంలో నైతం రాజుకు చెందిన లేగదూడ చిరుత దాడిలో మృతి చెందింది. బుధవారం పెంబి రేంజ్‌లో ఎఫ్‌ఆర్‌వో రమేశ్‌రావు 12వేల చెక్కును లేగదూడ యజమానికి అందజేశారు. ఈసందర్భంగా ఎఫ్‌ఆర్‌వో మాట్లాడుతూ వన్యప్రాణులు పశువులపై దాడి చేస్తే వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. డీఆర్వోలు గీత, ప్రతాప్‌నాయక్, ఎఫ్‌ఎస్‌వో సుందర్, అధికారులు ఉన్నారు.

విద్యార్థినికి బహుమతి

సోన్: విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన అబాకస్ రాష్ట్రస్థాయి పోటీల్లో మండలంలోని కడ్తాల్ వేదిక్ పాఠశాల విద్యార్థి బందేల నందిత రాష్ట్రస్థాయి బహుమతి పొందినట్లు హెచ్‌ఎం లింగయ్య తెలిపారు. గంజాల్ గ్రామానికి చెందిన నందిత వేదిక్ పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. కరస్పాండెంట్ సంజన, కడ్తాల్ గ్రామస్తులు నందితను అభినందించారు.

మాజీ సర్పంచుల అరెస్టు

లోకేశ్వరం: అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా మండలంలోని హవర్గ గ్రామ మాజీ సర్పంచ్ భుజంగ్‌రావు, రాజూర గ్రామ మాజీ సర్పంచ్ ముత్తగౌడ్‌ను బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని మాజీ సర్పంచ్‌లు కోరారు.

డిగ్రీ కళాశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు

భైంసాటౌన్: పట్టణంలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ బుచ్చయ్య తెలిపారు. బుధవారం కళాశాల ఆవరణలో సేంద్రియ పద్ధతిలో కూరగాయలు సాగుకు కిచెన్ గార్డెన్, బొటానికల్ గార్డెన్, ఫ్లవర్ గార్డెన్లు ఏర్పాటు చేశారు. మధ్యాహ్న భోజన పథకం కోఆర్డినేటర్ సంతోష్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రాజు, ఓం ప్రకాశ్, అధ్యాపకులు ఉన్నారు.

గ్రామాల్లో పర్యటించిన ఎంపీవో

ఖానాపూర్: మండలంలోని బావాపూర్(కె), కొత్తపేట గ్రామాల్లో బుధవారం ఎంపీవో రత్నాకర్‌రావు పర్యటించారు. ఈసందర్భంగా పంచాయతీ రికార్డులను పరిశీలించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం భగీరథ ఏఈ కృష్ణతో కలిసి తాగునీటి సమస్యలను తెలుసుకున్నారు.

కేంద్ర బడ్జెట్‌తో సామాన్యులకు మేలు



భైంసాలో క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

భైంసాటౌన్: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో సామాన్యులకు మేలు జరుగుతుందని బీజేపీ నాయకులు అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీజేపీ పట్టణశాఖ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. పన్ను వెసులుబాటుపై హర్షం వ్యక్తం చేశారు. పట్టణ అధ్యక్షుడు మల్లేశ్వర్, గౌతమ్, పోశెట్టి, వేణు, అనిల్, వెంకటేశ్, గంగాధర్, దశరథ్, కార్తీక్, రాజన్న ఉన్నారు.

భైంసారూరల్: కేంద్ర బడ్జెట్‌పై సంతోషం వ్యక్తం చేస్తూ మండలంలోని కోతల్‌గాంలో చేస్తూ బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు సుష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు బడ్జెట్‌పై తప్పుగా మాట్లాడటం సరికాదని పేర్కొన్నారు. భూమేశ్, సాయి, తిరుపతి, లింగం, భోజరాంపటేల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



బాసరలో క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాసర: రాష్ట్రంలో కులగణన సర్వే చేపట్టినందుకు బాసరలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మమ్మాయి రమేశ్ మాట్లాడుతూ గత పాలకులు పదేళ్లలో చేయని పనిని కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో చేస్తే ఓర్వలేక బురద చల్లుతున్నారని పేర్కొన్నారు. కార్యకర్తలు పాల్గొన్నారు.

కడెం: ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లలో మాదిగలకు ప్రాధాన్యం కల్పించారని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చొప్పదండి దుర్గభవాని హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని ధర్మాజీపేట్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

జీవన ఎరువుల వినియోగంతో దిగుబడులు



ఎరువులు అందిస్తున్న ఏవో వసంత్‌రావు

లక్ష్మణచాంద: జీవన ఎరువుల వినియోగంతోనే అధిక దిగుబడులు పొందవచ్చని ఏవో వసంత్ రావు తెలిపారు. బుధవారం లక్ష్మణచాందలో పీఎస్‌బీ ఎరువులను రైతులకు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. 100 కేజీల పశువుల ఎరువులో 2 నుంచి 3 కిలోల భాస్వరం కరిగించే జీవన ఎరువును కలిపి అఖరు దుక్కిలో, విత్తిన 30 రోజుల్లోపు మొక్కలకు చల్లుకోవాలని పేర్కొన్నారు. కావాల్సిన రైతులు పట్టాదారు పుస్తకం, ఆధార్ జిరాక్స్‌లతో లక్ష్మణచాంద రైతువేదిక వద్దకు రావాలని సూచించారు. కేజీ పాకెట్ రూ.25 ఉందని ఏఈవో పవిత్ర వివరించారు.

ఆలయంలో హుండీ అపహరణ

తానూరు: మండలంలోని మొగ్లి గ్రామంలో మహాదేవుడి ఆలయంలో ఉన్న హుండీని మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. మంగళవారం రాత్రి ఆలయంలో 11 గంటల వరకు భక్తులు భజన కార్యక్రమాలు నిర్వహించి ఇళ్లకు వెళ్లిపోయారు. బుధవారం ఉదయం పూజకు వెళ్లిన భక్తులకు ఆలయంలో హుండీ కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రమేశ్ ఆలయానికి వచ్చి వివరాలు సేకరించారు. రెండేళ్లుగా హుండీ ఆదాయం లెక్కించలేదని సుమారు రూ.40 వేల వరకు ఉండవచ్చని అంచనా వేశారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

నేటి నుంచి ప్రతిష్ఠాపనోత్సవాలు

- కాల్వ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిసరాల్లో కొలువు దీరనున్న స్వామి



కోనేటి ప్రాంగణంలో ధ్యానాంజేయ స్వామి

దిలావర్‌పూర్: మండలంలోని కాల్వ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ పరిసరాల్లో కోనేటి సమీపంలో ధ్యానాయంజేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. గురువారం నుంచి 8వ తేదీ వరకు వేడుకలు జరుగనున్నాయి. ఈమేరకు దాత అయిండ్ల చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు మహా ధ్యాన సముదాయం కోసం కొన్న ఎకరంలో రూ.30లక్షలతో ఏకశిల ధ్యానాంజనేయ విగ్రహానికి శనివారం పండితులు ప్రాణ ప్రతిష్ఠ చేయనున్నారు.

మూడు రోజులపాటు వేడుకలు

గురువారం, శుక్రవారం పూజాది కార్యక్రమాలు, యజ్ఞహోమాది పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చంద్రమోహన్‌రెడ్డి, ఇప్ప నర్సారెడ్డి పేర్కొన్నారు. శనివారం తెల్లవారుజామున 4:30 గంటలకు గణపతిపూజ, గోపూజ, పుణ్యాహవనం, ఆలయ యజ్ఞశాల ప్రదక్షిణ, అంగ, స్పర్శ, కళాహోమాది పూజలు, శయ్యాది ఉద్వాసన పీఠపూజ, నవరత్నన్యాసం, ధ్యానాయంజనేయ విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాల అనంతరం శ్రీ సీతారాముల కల్యాణం నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తుల కోసం నిర్మల్–భైంసా రహదారికి ఆనుకుని ఉన్న కాల్వ నరసింహ స్వామి ఆలయ స్వాగత తోరణం నుంచి రవాణా సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు.

సంక్షిప్త వార్తలు

నేటి నుంచి శివాలయ ప్రతిష్ఠాపనోత్సవాలు

మామడ: మండలంలోని పొన్కల్‌లో నిర్మించిన మహాదేవ శివాలయం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నుంచి ప్రారంభం కానున్నా యి. 6న ఆలయ విగ్రహాల ఊరేగింపు పూజలు, 7న పుణ్యాహవచనం, అంకురార్పణ, తీర్థప్రసాద వితరణ, 8న దేవతాయంత్రాలకు అభిషేకం, 9న చండీహవనం, రుద్రహవనం, గణపతి, నవగ్రహ, ధ్వజస్తంభం, విగ్రహ ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి, కల్యాణ కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. నిర్మల్ నుంచి పొన్కల్ వరకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

బీడీసీ కార్యవర్గానికి సన్మానం

ముధోల్: ముధోల్ వెనుకబడిన తరగతుల సంఘం కార్యవర్గాన్ని బుధవారం హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యవర్గ అధ్యక్షుడు విఠల్, ఉపాధ్యక్షుడు నాగేశ్, కోశాధికారి జిందం వార్, కార్యదర్శి భూమన్న తదితరులను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షులు రమేశ్ తదితరులున్నారు.

ఆంజనేయుడి ఆలయ వార్షికోత్సవం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బుధవార్‌పేట్ శ్రీ ఆంజనేయ శివ పంచాయతాన ఆలయ 11వ వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా వేదపండితులు శ్రీ శ్రీ తులసి భానుమూర్తిశర్మ ఆధ్వర్యంలో యజ్ఞాలు, తదితర పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు గంట రాకేశ్, అనుముల మోహన్, దొనగిరి మురళి, శ్రీధర్, కష్ట, రాజేందర్, శేఖర్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై సమావేశం

మామడ: మండలకేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల మండలాధ్యక్షులతో ఎంపీడీఓ సుశీల్‌రెడ్డి నిర్వహించారు. స్థానికసంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటర్ జాబితా ప్రదర్శన, సవరణ అంశాలను వివరించారు. వారి నుంచి సూచనలు స్వీకరించారు. ఎంపీఓ గంగాసాగర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ముధోల్: ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఓటరు జాబితాపై ఎంపీడీవో శివకుమార్ అధ్యక్షతన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఓటరు జాబితాలో సవరణలు, అభ్యంతరాలు ఉంటే తెలపాలని ఎంపీడీవో సూచించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రావుల రంగారెడ్డి, సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్, ఎస్‌ఏ నజీమ్ అహ్మద్, సీనియర్ అసిస్టెంట్ ఖాజా నజిమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ రేషన్ డీలర్‌కు సన్మానం

లోకేశ్వరం: ఉత్తమ సేవలు అందిస్తున్నందుకు మండలంలోని పిప్రి గ్రామ రేషన్ డీలర్ గంగన్న జనవరి 26న కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. బుధవారం గంగన్నను అంబేద్కర్ సంఘ భవనంలో సన్మానించారు. మగ్గిడి రాణి, మాల యువ సేన సంఘం అధ్యక్షుడు ఉదయ్, నిఖిల్, రాజు, కాంత్రి, ప్రసాద్, నాగేశ్, రాజు ఉన్నారు.